క్లుప్తంగా

భోగేశ్వరంలో ప్రత్యేక పూజలు



భోగేశ్వరుడికి అభిషేకం చేస్తున్న భక్తులు

గడివేముల: రథసప్తమి సందర్భంగా శైవక్షేత్ర మైన భోగేశ్వరాలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ రామానుజన్, ప్రధానార్చకులు శ్యామ్ సుందర్ శర్మ ఆధ్వర్యంలో స్వామి వారి మూలమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. అనంతరం నవగ్ర హాల్లో సూర్యదేవుడికి విశేష ద్రవ్యాభిషేకం, అలంకరణ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వివిధ ప్రాంతాల భక్తులు ఆలయానికి చేరుకుని స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులు స్థానిక కాశిరెడ్డి నాయన ఆశ్రమంలో అన్నప్రసాదాలు స్వీకరించారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



వివాహ వేడుకలో కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, సతీష్

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని ఉల్చాల గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీధర్ రెడ్డి కుమారుడి వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి ఆదివారం కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్ హాజరయ్యారు. కర్నూలు నగరంలోని ఎంఆర్‌సీ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన వేడుకలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. 40వ వార్డు కార్పొరేటర్ విక్రమసింహ రెడ్డి, శ్యామ్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, వంశీధర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, మద్దిలేటి రెడ్డి ఉన్నారు.

అలరించిన అష్టావధానం




అవధాని బులుసు అపర్ణను సన్మానిస్తున్న అతిథులు

కర్నూలు కల్చరల్: గోదాగోకులం, తోపుదుర్తి వెంకట్రామ్ ఆధ్వర్యంలో ఆదివారం నగర శివారులోని గోదాగోకులంలో అవధాని బులుసు అపర్ణ నిర్వహించిన అష్టావధానం ఆహుతులను అలరించింది. విద్వాన్ మారేడు రాముడు, డాక్టర్ తొగట సురేష్ బాబు, డాక్టర్ వీపూరి వెంకటేశ్వర్లు, డాక్టర్ కర్నాటి చంద్రమౌళిని, గొరెడ్డి హరిశ్చంద్రారెడ్డి మాదినేని మధుసూదన్, విద్వాన్ మునీశ్వరరావు, తోపుదుర్తి వెంకట్రామ్ పృచ్ఛకులుగా వ్యవహరించారు. మత్స్యశాఖ కమిషనర్ రామశంకర్ నాయక్, మాంటిస్సోరి విద్యాసంస్థల అధినేత కేపీ రాజశేఖర్ అతిథులుగా పాల్గొని మాట్లాడారు. అనంతరం అవధాని బులుసు అపర్ణను సన్మానించారు.

గోదా గోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజు గుప్త, ముద్రిక సాహితీ స్రవంతి వ్యవస్థాపక అధ్యక్షుడు భాస్కర్, గోదాగోకులం పరివారం, సాహితీ అభిమానులు పాల్గొన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి



షేక్ మహమ్మద్ హనీఫ్ (ఫైల్)

కర్నూలు (టౌన్): నాలుగవ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి కోలుకోలేక మృతి చెందాడు. స్థానిక వీకర్ సెక్షన్ కాలనీలో నివసించే షేక్ మహమ్మద్ హనీఫ్ (53) సిల్వర్ సామాన్ల వ్యాపారం చేస్తున్నాడు. ఈయనకు భార్య, ముగ్గురు కుమారులు. మద్యం తాగే అలవాటు ఉంది. భార్యతో తరచూ గొడవ పడేవాడు. ఈ నెల 6న తాగి గొడవ పడటంతో భార్య విసుగు చెంది పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపం చెంది ఇంటి ముందు కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇరుగుపొరుగు వారు మంటలను ఆర్పి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ ఈ నెల 8వ తేదీ రాత్రి చనిపోయినట్లు పోలీసులు వెల్లడించారు. కుమారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

కళాశాల గుర్తింపును రద్దు చేయాలి

కర్నూలు(సెంట్రల్): అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్న కర్నూలు నగర శివారులోని కేవీ సుబ్బారెడ్డి కళాశాల గుర్తింపును రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ముందస్తు పేరుతో అడ్మిషన్ల కోసం డబ్బులు వసూలు చేసిన యాజమాన్యం సంబంధిత విద్యార్థులకు అడ్మిషన్ అయినా ఇవ్వాలి లేదంటే కట్టిన డబ్బులైనా వెనక్కి ఇవ్వాల్సి ఉన్నా పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. అలాగే సెమిస్టర్ పరీక్షలకు ఫీజు వసూలు చేయడం అన్యాయమన్నారు.

‘కంది’పోయిన రైతన్న

- జిల్లాలో 1,58,749 ఎకరాల్లో కంది పంట సాగు
- మద్దతు ధరపై కొనుగోలుకు అనేక ఆంక్షలు
- తేమ శాతం 12 లోపు ఉంటేనే కొనుగోలు
- మార్కెట్ ధరకు, మద్దతు ధరకు వ్యత్యాసం కేవలం రూ.550 మాత్రమే

కంది పంట దిగుబడులు చేతికందివచ్చినా రైతన్నకు కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. అసలే బహిరంగ మార్కెట్‌లో మద్దతు ధర లేకపోవడం ఆపై ప్రభుత్వం మద్దతు ధర క్వింటాలు రూ.7550 ప్రకారం కొనుగోలు చేసేందుకు సవాలక్ష ఆంక్షలు విధించడంతో రైతన్నలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. తేమ శాతం 12 లోపే ఉండాలని, జల్లెడ పట్టి నాణ్యమైన గింజలనే తేవాలనే నిబంధనలతో ఆందోళన చెందుతున్నారు. అసలే తుపాను వల్ల దిగుబడులు అంతంత మాత్రంగానే వచ్చాయని, క్వింటాలు రూ.9 వేల ప్రకారం కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

కోడుమూరు రూరల్: ఆరుగాలం కష్టించి పంటలు పండించే రైతన్నను కష్టాలు వెంటాడుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులకు కష్టాలు మొదలయ్యాయి. మార్కెట్లో రేటు ఉంటే రైతు వద్ద సరుకు ఉండదు. రైతు వద్ద సరుకు ఉంటే మార్కెట్లో గిట్టుబాటు ధర ఉండని పరిస్థితి నెలకొంది. కంది పంట దిగుబడులు రైతుల చేతికి రానంత వరకు క్వింటాలు రూ.9 వేలకు పైగానే పలికాయి. రైతుల చేతికి కంది దిగుబడులు వచ్చే సరికి క్వింటాల్ కందులు రూ.6900 నుంచి రూ.7000కు పడిపోయాయి. అసలే తుపాన్ ప్రభావం వల్ల కురిసిన వర్షాలకు అంతంత మాత్రంగా వచ్చిన కంది దిగుబడులకు మార్కెట్లో సరైన ధర లేకపోవడంతో రైతులకు పెట్టుబడులు కూడా దక్కని పరిస్థితి నెలకొంది.

కంటి తుడుపు చర్యగా కందులకు మద్దతు ధర

ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 1,58,749 ఎకరాల్లో కంది పంట సాగైంది. అయితే రైతుల చేతికి పంట దిగుబడులు వచ్చినప్పటి నుంచి మార్కెట్లో ధర లేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం క్వింటాల్ కందులను రూ.7550 ప్రకారం కొనుగోలు చేస్తామంటూ ప్రవేశపెట్టిన మద్దతు ధర కేవలం కంటి తుడుపు చర్యగా ఉందని రైతులు విమర్శిస్తున్నారు. మార్కెట్లో క్వింటాల్ ధర రూ.7000 పలుకుతుండగా, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.7550గా ఉంది. దీంతో క్వింటాల్ కందులకు ప్రభుత్వం అదనంగా కేవలం రూ.550 మాత్రమే చెల్లిస్తోందని రైతులు పేర్కొంటున్నారు.

కందుల కొనుగోలుకు అనేక షరతులు

మద్దతు ధరకు కందులను అమ్ముకునేందుకు ప్రభుత్వం రైతులకు అనేక షరతులను విధించింది.

- రైతు కచ్చితంగా పంట నమోదు చేయించుకుని ఉండాలి.
- ఎకరాకు కేవలం 5 క్వింటాళ్ల కందులు మాత్రమే కొనుగోలు చేస్తారు
- కందుల్లో తేమ శాతం 12లోపే ఉండాలి.
- జల్లెడ వేసిన తర్వాతనే రైతులు తెచ్చిన కందులను కొనుగోలు చేస్తుండడం ఇందుకు రైతుకు అదనంగా క్వింటాల్‌కు రూ.100 వరకు ఖర్చవుతుండడంతో రైతులు బేజారెత్తిపోతున్నారు.

ఇచ్చే తక్కువ మద్దతు ధరకు ఇన్ని షరతులా అంటూ రైతులు వాపోతున్నారు.



కోడుమూరులో మార్కెఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రం



మిషన్ ద్వారా కందుల్లో తేమ శాతం చూస్తున్న దృశ్యం

ప్రభుత్వం ఇచ్చే ధర గిట్టుబాటు కావడం లేదు



రెండెకరాల్లో రూ.40 వేల వరకు పెట్టుబడి కంది పంట సాగు చేస్తే 7 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. చేసిన కష్టం కూడా గిట్టని పరిస్థితి నెలకొంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం కందులకు ప్రకటించిన మద్దతు ధరకు, మార్కెట్లో ఉన్న ధరకు కేవలం రూ.550 మాత్రమే వ్యత్యాసం ఉంది. పైగా ప్రభుత్వం ప్రకటించిన ధరకు అమ్మాలంటే సవాలక్ష ఆంక్షలను విధించారు. ఇవన్నీ పూర్తి చేస్తే రైతుకు ఏమీ మిగులుబాటు కాదు. క్వింటాల్ కందులకు రూ.9,000 ధర చెల్లిస్తే రైతులకు కొంచెం మిగులుబాటవుతుంది.

– రైతు మిన్నెల్ల హుసేన్, ప్యాలకుర్తి

భూములిచ్చిన రైతులకు న్యాయం చేయాలి



పాణ్యంలో మాట్లాడుతున్న కాటసాని రాంభూపాల్ రెడ్డి

- కాలయాపన చేయడం తగదు
- ప్రజా సమస్యలు గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం
- మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పాణ్యం: మండలంలోని పిన్నాపురం గ్రామంలో సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు భూములిచ్చిన రైతులకు త్వరగా పరిహారం అందించాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి కోరారు. ఆయన ఆదివారం పాణ్యంలోని ఇందిరా కాలనీలో శివదీక్ష స్వీకరించిన స్వాములతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సోలార్ పరిశ్రమకు భూములిచ్చిన రైతులకు ప్రభుత్వం, కంపెనీ త్వరగా పరిహారం అందించి ఆదుకోవాలన్నారు. పరిహారం నానాటికీ ఆలస్యం కావడంతో రైతుల్లో ఆందోళన నెలకొందన్నారు. దీనిపై ఇప్పటికే కలెక్టర్, కంపెనీ అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినట్లు చెప్పారు. పరిహారం విషయంలో జాప్యం చేస్తే రైతుల తరఫున పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు.

ప్రజా సమస్యలను గాలికొదిలేసిన కూటమి

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్రంలో ప్రజా సమస్యలను గాలికొదిలేసిందని మాజీ ఎమ్మెల్యే కాటసాని విమర్శించారు. ఎక్కడ చూసినా సమస్యలు నెలకొన్నాయని, క్షేత్రస్థాయిలో వాటిని పరిష్కరించే అధికారులు లేక ప్రజలు అవస్థలు పడుతున్నట్లు చెప్పారు. విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసి, పేద విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియం లేకుండా చేశారన్నారు. అంతేకాక ప్రభుత్వ పాఠశాలలో అందించే మధ్యాహ్న భోజనం నాణ్యత లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నట్లు చెప్పారు. అలాగే ఆరోగ్య వ్యవస్థను పూర్తిగా విస్మరించారని, లా అండ్ ఆర్డర్ గాడి తప్పిందన్నారు. ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపుతున్నారని ఆరోపించారు. పని చేయకముందే ప్రచార ఆర్భాటాలు, గ్లోబల్ రేంజ్‌లో ప్రచారం చేసుకోవడం తప్పా క్షేత్రస్థాయిలో కూటమి ప్రభుత్వం చేసింది శూన్యమన్నారు. కూటమి ప్రభుత్వానికి త్వరలోనే ప్రజలు గుణపాఠం నేర్పుతారన్నారు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ సుబ్బరాయుడు, ఎల్ల గౌడ్, స్వామి, సత్యాలు, సురేంద్ర, రామ్ తదితరులు పాల్గొన్నారు.

27న బండలాగుడు పోటీలు

ఓర్వకల్లు: మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో ఈ నెల 27వ తేదీన అంతర్రాష్ట్ర న్యూ కేటగిరీ (ఏడు పళ్ల) విభాగం ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నిర్వహించే పోటీలలో గెలుపొందిన వృషభాల యజమానులకు వరుసగా రూ.60 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.8 వేల చొప్పున నగదు బహుమతులను అందజేయనున్నట్లు వెల్లడించారు.

28న పాలపళ్ల విభాగం ఎద్దుల బండలాగుడు పోటీలు

అదేవిధంగా 28న పాలపళ్ల విభాగం ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించి విజేతలకు వరుసగా రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.5 వేల చొప్పున నగదు బహుమతులను ప్రధానం చేయడం జరుగుందన్నారు. ఆసక్తి గల ఎద్దుల యజమానులు అదే రోజు ఉదయం 8 గంటలకు నిర్దేశించిన ప్రవేశ రుసుం చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని వెల్లడించారు. మరిన్ని వివరాలకు 99496 53087, 99595 16175, 90008 49454 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పరిష్కార వేదికకు అధికారులందరూ హాజరవ్వాలి

సి.బెళగల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులందరూ తప్పనిసరిగా హాజరవ్వాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం సూచించారు. ఆయన ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడిస్తూ.. పీజీఆర్ఎస్‌కు హాజరుకాని అధికారులపై ఉన్నతాధికారులకు నివేదికలు పంపి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల ప్రజలు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కార్బైడ్ ఫ్యాక్టరీని పునఃప్రారంభించాలి

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని దిన్నేదేవరపాడు గ్రామ పరిధిలో ఉన్న కార్బైడ్ ఫ్యాక్టరీని తిరిగి ప్రారంభించాలని సీఐటీయూ నాయకులు, ఫ్యాక్టరీలో గతంలో పనిచేసిన కార్మికులు ఆదివారం ఆ ఫ్యాక్టరీ ఎదురుగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ.. కార్బైడ్ ఫ్యాక్టరీని మూసివేయడంతో కాలనుగుణంగా ఓ వైపు కార్మికులు మరణిస్తున్నారని, బతికి ఉన్న కార్మికులకు ఉపాధి లేక జీవనం కష్టమైందని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా వారు మాట్లడుతూ.. 120 మంది కార్మికులకు పెడింగ్ వేతనాలు ఇవ్వాలని, రూ.5 కోట్ల పెండింగ్ పీఎఫ్ బకాయిలు కార్మికుల ఖాతాలో లో జమచేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ ఉపాధ్యక్షుడు లక్ష్మన్న, ఆదిశేషన్న, భాస్కర్ రెడ్డి, శివ, సోలోమాన్, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

27న అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీలు

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గలో ఈ నెల 27వ తేదీన బాలుర అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యుడు షేక్షావలి, షాషావలి ఆదివారం ఓ ప్రకటలో తెలిపారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నిర్వహించనున్న ఈ పోటీల్లో విజేతలకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.3 వేల చొప్పున నగదు బహుమతులు అందించనున్నట్లు ప్రకటించారు. ఆసక్తి గల జట్లు అదే రోజు ఉదయం 8 గంటలకు పేర్లను నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 90146 59220, 97014 78079 సెల్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

కార్ల సర్వీస్ సెంటర్‌లో అగ్ని ప్రమాదం

కర్నూలు కల్చరల్: స్థానిక వీఆర్ కాలనీలోని శ్రీహరి సర్వీసింగ్ సెంటర్‌లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. రాజేశ్వర్ రెడ్డి నిర్వహిస్తున్న సర్వీస్ సెంటర్‌లో ఆదివారం తెల్లవారుజామున ఓ కారు నుంచి మంటలు రావడంతో చుట్టుపక్కల వారు అగ్నిమాపక శాఖ వారికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అర్పివేశారు. అప్పటికే ఒక కారు పూర్తిగా కాలిపోవడం, రెండు కార్లు పాక్షికంగా కాలిపోయాయి. కారులో షార్ట్ సర్క్యూట్ జరగడంతోనే ప్రమాదం చోటు చేసుకున్నట్లు ప్రాథమిక అంచనాకు వచ్చారు. రూ.లక్షల్లో నష్టం వాటిల్లినట్లు గుర్తించారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



మాట్లాడుతున్న సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి

గడివేముల: నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని, ఇష్ట దైవాన్ని స్మరించుకోవడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని శంకరాచార్య స్వయం ప్రకాశ సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి పేర్కొన్నారు. మండల కేంద్రమైన గడివేములలో రాజరాజేశ్వరి పాఠశాలలో ఆదివారం రాత్రి మహాస్వామి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. చుట్టుపక్కల మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీర్వాదం పొందారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ.. నేటి రోజుల్లో ప్రతి ఒక్కరూ పని ఒత్తిడి ప్రభావం వల్ల మనశ్శాంతిని కోల్పోతున్నారన్నారు. ఆలయాలకు వెళ్లి పూజలు చేయడం, ఇష్ట దైవాన్ని ఆరాధించడం ద్వారా మనసు ప్రశాంతంగా ఉంటుందన్నారు. కులమతాలకు అతీతంగా ఐకమత్యంగా అందరూ కలిసి ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుపుకోవాలన్నారు. పలువురు నాయకులు స్వామివారి ఆశీర్వాదం పొందారు.

ఇలా ఉంటే రోగాలు రావా?





హాస్టల్ పరిసరాల్లో లోపించిన పారిశుద్ధ్యం



మంచినీటి ట్యాంకులో పేరుకుపోయిన పాచి



నాణ్యత లేని చికెన్‌ను పరిశీలిస్తున్న సూపర్‌వైజర్

గడివేముల: స్థానిక మోడల్ స్కూల్ హాస్టల్‌ను ఆదివారం ప్రాథమిక ఆరోగ్య శాఖ సిబ్బంది తనిఖీ చేశారు. ఆదివారం కావడంతో విద్యార్థినులకు వడ్డించేందుకు తీసుకొచ్చిన చికెన్‌ను పరిశీలించగా నాణ్యత లేదని తెలిసింది. ఈ నెల 2వ తేదీన నాణ్యత లేని, సరిగా ఉడకని చికెన్ తిని విద్యార్థినులు అస్వస్థతకు గురైన సంఘటన తెలిసిందే. దీంతో అధికారులు ఆదివారం హాస్టల్ పరిసరాలను పరిశీలించగా అపరిశుభ్రతతో పాటు విద్యార్థులు తాగే మంచినీటి ట్యాంకులను గత కొన్ని నెలలు శుభ్రం చేయకపోవడంతో పాచి పట్టి, అపరిశుభ్రంగా ఉన్నట్లు గుర్తించారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని వారు తెలిపారు. అనంతరం హాస్టల్లోని విద్యార్థులకు పలు రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. వైద్య సిబ్బంది విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించేందుకు వెళ్లినా హాస్టల్‌లో వార్డెన్ లేకపోవడంతో ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థం అవుతుంది. సూపర్‌వైజర్ మనోహర్, ఏఎన్ఎం భారతి, ఆశా వర్కర్లు ఉన్నారు.

ఘనంగా పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవం



మాట్లాడుతున్న పీఆర్‌టీయూ నాయకులు

కల్లూరు: కర్నూలు నగరంలోని పీఆర్‌టీయూ కార్యాలయంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్‌పీ కృష్ణారెడ్డి, ఎం.ధనుంజయ ఆధ్వర్యంలో పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కరుణానిధి మూర్తి, కల్లూరు ఎంఈఓ శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంచాయతీరాజ్ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం, వారు ఎదుర్కొంటున్న వివక్షతను రూపుమాపడం కోసం పీఆర్‌టీయూ సంఘం దశాబ్దాలుగా పోరాటం చేస్తుందన్నారు. ఉపాధ్యాయుల శ్రేయస్సు, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు చెప్పారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రవి ప్రకాష్, రాష్ట్ర కౌన్సిలర్లు బాబురావు, ఆదినారాయణరెడ్డి, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పాణ్యం: మండల పరిధిలోని సుగాలిమెట్ట సమీపంలో కొచ్చెరువు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయినట్లు హైవే పోలీసులు తెలిపారు. వివరాల మేరకు.. బేతంచెర్లకు చెందిన అశోక్ ద్విచక్ర వాహనంపై వస్తుండగా ముందు వెళ్తున్న కారును తప్పించబోయి ప్రమాదానికి గురైనట్లు చెప్పారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నంద్యాలకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

12న బార్తాల పున్నమి వేడుకలు

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని వెంకాయపల్లె గ్రామ సమీపాన వెలసిన వెంకాయపల్లె ఎల్లమ్మ బార్తాల పున్నమిని ఈ నెల 12న ఘనంగా నిర్వహించనున్నారు. ఇక్కడి అమ్మవారిని రెండు తెలుగు రాష్ట్రాల్లోని భక్తులు ఆరాధ్య దైవంగా కొలుస్తారు. ఏ ఇంట్లో శుభకార్యం నిర్వహించాలన్నా కులమతాలకు అతీతంగా ముందుగా అమ్మవారి దేవర నిర్వహించి తర్వాతే శుభకార్యాలు జరుపుకోవడం ఇక్కడి ప్రజల ఆనవాయితీ. అమ్మవారి జయంతి సందర్భంగా ఈ నెల 12న బార్తాల పున్నమి మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.యస్.రాధాక్రిష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవదాయ ధర్మదాయ శాఖ వారి ఆధ్వర్యంలో ఆలయంలో చేపట్టే పూజా కార్యక్రమాల వివరాలను వెల్లడించారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

బార్తాల పున్నమి సందర్భంగా 11న గణపతి పూజ, అంకురార్పణ, అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన, అఖండస్థాపన, బలిప్రదానం, నిత్యహోమం, గ్రామంలో ఉత్సవమూర్తి ఊరేగింపు, 12న తెల్లవారుజామున 5 గంటల నుంచి అభిషేకాలు, పంచామృతాభిషేకములు, కుంకుమార్చన, సాయంత్రం 4:30 గంటలకు ఆలయం ప్రధాన వీధుల్లో అమ్మవారికి పల్లకీ సేవ ఉంటుందని వెల్లడించారు. అలాగే 13న అమ్మవారికి అభిషేకాలు, అఖండ దీపారాధన, ఉద్వాసన, పూర్ణాహుతి హోమంతో ఉత్సవాలు ముగించనున్నట్లు వెల్లడించారు.

రగ్బీ పోటీలకు జట్టు ఎంపిక



జాతీయ స్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొనే ఏపీ జట్టు క్రీడాకారులు

కర్నూలు (టౌన్): మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ పట్టణంలో ఈనెల 11, 12 తేదీల్లో నిర్వహించనున్న జాతీయస్థాయి బాలికల అండర్–15 రగ్బీ పోటీల్లో సత్తా చాటాలని ఆంధ్రప్రదేశ్ రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు సూచించారు. ఆదివారం స్థానిక నగర శివారులోని దిన్నెదేవరపాడులోని ఏపీఎస్‌డబ్ల్యూఆర్ క్రీడా మైదానంలో.. జాతీయ పోటీల్లో పాల్గొనే ఏపీ జట్టును ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేగంగా అభివృద్ధి చెందుతున్న క్రీడల్లో రగ్బీ ఒకటని, అందులో రాణించాలన్నారు. గుర్తింపు ఉన్న క్రీడల వల్ల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. ఏపీ జట్టు మేనేజర్ జ్యోతి, జిల్లా రగ్బీ సంఘం ప్రతినిధి కొండెపోగు చిన్న సుంకన్న పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీచౌడేశ్వరి తిరునాల



కోడుమూరులో కొలువుదీరిన చౌడేశ్వరీ దేవి



ఉత్సవాలకు ముస్తాబవుతున్న రథం

కోడుమూరు రూరల్: కోడుమూరులో వెలసిన చౌడేశ్వరి దేవి తిరునాల ఉత్సవాలను సోమవారం నుంచి అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అటగార దేవాంగ దైవచార సంఘం సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం గుమ్మటోత్సవంతో ఉత్సవాలు ప్రారంభమై 16న వసంతోత్సవంతో ముగియనున్నాయి. దేవి తిరునాల ఉత్సవాల్లో భాగంగా సోమవారం గుమ్మటోత్సవం, 11న ప్రభోత్సవం, 12న నంది ధ్వజశావ, 13న రథోత్సవం, 14న తిరుగు రథోత్సవం, 15న పారువేట, 16న వసంతోత్సవం కార్యక్రమాలను వైభవంగా నిర్వహించేందుకు సంఘం సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

ఉత్సవాల సందర్భంగా గ్రామీణ క్రీడా పోటీలు

చౌడేశ్వరీ దేవి తిరునాల పురస్కరించుకుని ఈనెల 12, 13, 14 తేదీల్లో గ్రామీణ క్రీడలు నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ఇప్పటికే ప్రారంభమవ్వగా, 12న స్లోసైకిల్, చదరంగం, జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు, వ్యాసరచన, ఓపెన్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నారు. అలాగే 13వ తేదీ గోనెసంచితో పరుగెత్తడం, పొట్టేళ్ల పోటీ, మహిళలు, పురుషుల విభాగాల్లో వేర్వేరుగా వాలీబాల్ పోటీలు, తిండి వీరుల పోటీ, తప్పెట, ముద్దుపాపల పోటీలు, 14న మ్యూజికల్ చైర్స్, మహిళలకు ముగ్గుల పోటీలు, చిన్నారులకు డాన్స్ బేబీ డాన్స్ పోటీలను నిర్వహించనున్నారు. విజేతలకు దాతల సహకారంతో నగదు, ప్రోత్సాహక బహుమతులను అదించనున్నట్లు కమిటీ సభ్యులు వెల్లడించారు.